క్లుప్తంగా

లోక్ అదాలత్‌తో 635 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న మేజిస్ట్రేట్ సాజన్య

భీమునిపట్నం: భీమిలిలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 635 కేసులు పరిష్కారమయ్యాయి. ఒకటో అదనపు సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ డి.సాజన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దీంతో పాటు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు సంబంధించి ఈమె ఇన్‌చార్జి మేజిస్ట్రేట్‌గా వ్యవహరించారు. ఈ అదాలత్‌లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే అపరాధ రుసుము కింద రూ. 27.21లక్షలు వచ్చాయి. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.వి.పార్వతీశం, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

16న మెగా రక్తదాన శిబిరం

భీమునిపట్నం: భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు కై తపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కీతిన్‌పేట సన్‌స్కూల్ వద్ద ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇది 25వ శిబిరమని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ అపోహలు వీడి, రక్తదానం చేయాలని కోరారు.

మధురవాడలో వారాహి మాత ఆలయ నిర్మాణం

మధురవాడ: వారాహి మాత ఆలయాన్ని ఉత్తరాంధ్రలోనే మొట్టమొదటి సారిగా మధురవాడలో ఏర్పాటు చేస్తున్నట్టు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. మధురవాడ వైఎస్సార్ కాలనీలోని శ్రీ వాసవి మాత ఆలయ ఆవరణలో ఈ ఆలయ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధి, వెంకటేశ్వర విద్యాసంస్థల అధినేత యేటూరి వెంకటేశ్వర్లు, కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి పోలమాంబ వార్షికోత్సవాలు

తగరపువలస: సంగివలస పోలమాంబ (ముగ్గురు అమ్మవార్ల) ఆలయ వార్షిక వేడుకలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు పార్కు వైపు నుంచి క్యూ లైన్లు, తాగునీరు, పార్కింగ్ వంటి వసతులు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం మరిడిమాంబ, సోమవారం ముత్యమాంబ, పోలమాంబ అమ్మవార్లకు ఉత్సవాలు జరిపించి మంగళవారం ముగ్గురు అమ్మవార్లకు అనుపు ఉత్సవం నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు, అనుపురోజు బాణసంచా, నేలవేషాలు, నవదుర్గ వేషాలు ఏర్పాటు చేశారు.

అధిక లోడు లారీలకు రూ.1.76 లక్షల జరిమానా

పద్మనాభం: పరిమితికి మించి అధిక బరువు గ్రానైట్‌తో వెళ్తున్న నాలుగు లారీలను శుక్రవారం రాత్రి పట్టుకుని రవాణా శాఖ అధికారులకు అప్పగించగా, వీటికి రూ.1.76,000 జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. చోడవరం నుంచి నాలుగు లారీలు పరిమితికి మించి గ్రానైట్‌తో శ్రీకాకుళం వెళ్తున్నాయి. మార్గమధ్యలో వీటిలో రెండు లారీలను మద్ది జంక్షన్, రెండు లారీలను రేవిడి జంక్షన్‌లో పట్టుకుని రవాణా శాఖ అధికారులకు అప్పగించగా, ఈ జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు.

శ్మశాన వాటికలో వసతులకు భూమిపూజ

తగరపువలస: చిట్టివలస శ్మశానవాటికలో వసతుల కల్పనకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం భూమిపూజ జరిగింది. ఇక్కడ శివుని విగ్రహాన్ని కొండపు శ్రీనివాసరెడ్డి, చెత్త కుండీని చిలకా రమేష్ సహకారంతో నిర్మించనున్నారు. ఈ భూమిపూజలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాముునాయుడు, ప్రముఖ వ్యాపారవేత్త రంగూరి సీతారామదొర, పరిమి భువనేశ్వరి, చిలకా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతునికి పెళ్లి కళ

అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవాలకు వేళయింది. కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 9 నుంచి 15 వరకు వేడుకలను వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల ఆరో తేదీన ఉత్సవ రాటతో సందడి మొదలైంది. 9న అంకురార్పణ, 10న కల్యాణం, 12న తెప్పోత్సవం, 13న రథోత్సవాలు జరిపించనున్నారు. సంబంధిత ఏర్పాట్లలో ఆలయ వర్గాలు నిమగ్నమయ్యాయి.

నేడు అంకురార్పణ
10న పరిణయ వేడుక
12న తెప్పోత్సవం
13న రథోత్సవం



కల్యాణ మహోత్సవాలకు సిద్ధం చేసిన శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలు



అనంతుని తెప్పోత్సవం (ఫైల్)

పద్మనాభం: అనంత పద్మనాభుడు కొలువుదీరిన అరుదైన ఆలయం ఇది. దేశంలో రెండు చోట్ల మాత్రమే ఈ ఆలయాలు ఉండటం విశేషం. అందులో ఒకటి కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం కాగా.. రెండోది విశాఖ జిల్లా పద్మనాభం మండలం పద్మనాభం గ్రామంలో గిరిపై ఉన్న ఈ ఆలయం. ఈ కోవెలకు అనుబంధంగా ఉండే కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలను ఏటా కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఆ వేడుకలు సమీపించడంతో అంతటా సందడి నెలకొంది.

కల్యాణోత్సవాలు ఈ నెల తొమ్మిది నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయి. ఇప్పటికే ఈ నెల ఆరో తేదీన కుంతీ మాధవ స్వామి ఆలయ గాలి గోపురం వద్ద పెళ్లి రాట వేశారు. దీంతో అనంతునికి పెళ్లి కళ వచ్చేసింది.

వేడుకలు ఇలా..

- ఈ నెల 9వ తేదీ రాత్రి కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఇదే రోజు రాత్రి కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి చక్ర పెరుమాళ్ల విగ్రహాన్ని పల్లకీలో ఉంచి, పాత సంత నిర్వహించే స్థలం వద్దకు తీసుకు వస్తారు. ఇక్కడ విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, భూమి పూజ నిర్వహిస్తారు. అనంతరం పుట్టబంగారాన్ని యాగశాలలోకి తీసుకు వెళ్లి 12 పాళిక(ప్రమిదలు)ల్లో వేస్తారు.
- ఈ నెల 10న రాత్రి అనంతుని కల్యాణం జరుగుతుంది. ముందుగా ఎదురు సన్నాహ ఉత్సవం నిర్వహిస్తారు. అనంత పద్మనాభ స్వామిని హనుమత్ వాహనంపై, శ్రీదేవిని హంస వాహనంపై, భూదేవిని గజ వాహనంపై కొలువుదీర్చి, రాజు వీధిలోకి తోడ్కొని వచ్చి ఎదురు సన్నాహ ఉత్సవం నిర్వహిస్తారు. పెళ్లి కొడుకు అయిన అనంత పద్మనాభ స్వామి తరపు వారు పెళ్లి కుమార్తెలయిన శ్రీదేవి భూదేవి కుటుంబ సభ్యులను ఎంత కట్నం ఇస్తారని అడగడం, కట్నం ఇవ్వడానికి పెళ్లి కొడుకు ఏమి చేస్తున్నారని పెళ్లి కుమార్తెల బంధువులు అడగడం వంటి ఘట్టాలు ఆసక్తికరంగా సాగుతాయి. అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపిస్తారు.
- ఈ నెల 11న విశేష హోమం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను గ్రామంలో పల్లకీలో ఊరేగిస్తారు.
- ఈ నెల 12వ తేదీ రాత్రి అనంతుని తెప్పోత్సవం జరుగుతుంది. గతంలో వేడుకగా జరిగిన ఉత్సవం కాలక్రమంలో మరుగున పడింది. ఆ సమయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు చొరవతో 2023 నుంచి తెప్పోత్సవం పునః ప్రారంభమైంది. ముందుగా కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా పద్మనాభం జంక్షన్‌లో ఉన్న అనంతుని పుష్కరిణి వద్దకు తోడ్కొని వస్తారు. అర్చన అనంతరం శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఆశీనులను చేస్తారు. తదుపరి ఉభయ దేవేరులతో అనంత పద్మనాభ స్వామి హంస వాహనంపై ఊరేగుతారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య తెప్పోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుంది.
- 13వ తేదీ రాత్రి రథోత్సవం జరుగుతుంది. కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ రథంపైకి తోడ్కొని వస్తారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రథం ముందు కుంభం(అన్నం) పోస్తారు. స్థానిక పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రథమ పూజ చేసిన అనంతరం రథోత్సవం ప్రారంభమవుతుంది. కృష్ణాపురం గ్రామానికి చెందిన మొకర, నుంకర, కనకల, గాడు, పద్మనాభం గ్రామానికి చెందిన తాలాడ, ఇసకలపాలెం గ్రామానికి చెందిన కంటుబోతు, అర్చకునిపాలెం గ్రామానికి చెందిన తాలాడ, మద్ది గ్రామానికి చెందిన కనకల వారి కుటుంబ సభ్యులతో పాటు అశేష భక్త జనవాహిని రథాన్ని లాగడంతో.. అనంతుని రథచక్రాలు వడివడిగా ముందుకు సాగుతాయి.
- 14వ తేదీ ఉదయం పద్మనాభంలోని జిల్లా పరిషత్ అతిథి గృహం సమీపంలో ఉన్న డోలా మండపానికి స్వామి వేంచేస్తారు. ఇక్కడ ఉభయ దేవేరులతో అనంత పద్మనాభ స్వామి ఊంజల్ సేవ ఉంటుంది.
- 15వ తేదీన వినోదోత్సవం జరుగుతుంది. దీనిలో భాగంగా రాత్రి శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు పుష్పయాగం నిర్వహిస్తారు.



విద్యుద్దీపాలంకరణలో గాలిగోపురం



కుంతీ మాధవ స్వామి ఆలయం



తెప్పోత్సవం నిర్వహించనున్న అనంతుని పుష్కరిణి



యాగశాల

బోరుబావికి మరమ్మతులు



మరమ్మతులు చేయడంతో పని చేస్తున్న బోరుబావి

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలస కార్మికవాడకు చెందిన ఒంటివాసాలో మూలకు చేరిన బోరుబావికి ఇంజినీరింగ్ సిబ్బంది శనివారం మరమ్మతులు పూర్తి చేశారు. 'బోరుబావి శిథిలం' శీర్షికతో ఈ నెల 7న సాక్షిలో ప్రచురించిన వార్తకు వారు స్పందించారు. బోరుబావికి మరమ్మతులు చేసి, అందుబాటులోకి తెచ్చారు. కార్మికవాడ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

రుషికొండ బీచ్ పరిశీలన



బీచ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది: రుషికొండ బీచ్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం సాయంత్రం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బ్లూఫ్లాగ్ ప్రమాణాలకు అనుగుణంగా బీచ్‌ను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతామన్నారు. బ్లూ ఫ్లాగ్‌ను గురించే డెన్మార్క్ సంస్థ ప్రతినిధులు ఈ నెల 14న డెన్మార్క్ రానున్నారన్నారు. వారు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటకశాఖ వద్ద నిధుల సమస్య ఉన్నందున ప్రైవేటు భాగస్వామ్యంతో పనులు చేపట్టడానికి పరిశీలిస్తామన్నారు. ఆయన వెంట పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ రీజనల్ డైరెక్టర్ జగదీష్, అసిస్టెంట్ మేనేజర్ బసంత్, ఇతర అధికారులు ఉన్నారు.

ప్రతి మహిళా స్ఫూర్తి ప్రదాత

- అన్ని రంగాల్లో ఆమెదే విజయం
- వక్తల ప్రశంసలు
- ఘనంగా మహిళా దినోత్సవం



వెల్లంకిలో ఉపాధ్యాయిని అనురాధను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు



రాయపాలెంలో వికాస ఆధ్వర్యంలో వేడుకలు



దివీస్ ఆధ్వర్యంలో ..



మహిళా ఉద్యోగిని సన్మానిస్తున్న ఆచార్య మలయవాసిని



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఆనందపురం ఎంపీపీ శారద ప్రియాంక



పోలీస్ బెటాలియన్‌లో ముగ్గుల పోటీల్లో రంగవల్లులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



కంటి వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు



ప్రశాంతిని సత్కరిస్తున్న విశిష్ట మహిళలు

తగరపువలస: ప్రతి మహిళా స్ఫూర్తి ప్రదాత అని వక్తలు పేర్కొన్నారు. ఏ రంగంలో అడుగిడినా ప్రతిభ కనబరిచి, విజయాలను సొంతం చేసుకుంటారని ప్రశంసించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సత్కరించారు.

- భీమిలి మండలం చిప్పాడ దివీస్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో జరిగిన వేడుకలలో భీమిలి పీహెచ్‌సీ వైద్యురాలు కల్యాణి పాల్గొన్నారు. మహిళలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్‌డీడబ్ల్యూఎస్ సంస్థ డైరెక్టర్ మహంతి ఊహ రుతుక్రమ పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. మహిళలకు ఆటపాటల పోటీలు నిర్వహించగా సీఎస్‌ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు బహుమతులు అందజేశారు.
- ఆనందపురం మండలం వెల్లంకిలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో చిప్పాడ జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ కీర్తి అనురాధను, స్థానిక మహిళలను సత్కరించారు. తమటపు నాగమణి, పిల్లా విజయమ్మ తదితరులు పాల్గొన్నారు. ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులను సత్కరించారు.
- జిల్లాలో ఉమెన్ ఎకో ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీగా ఎంపికైన గంభీరంలో జరిగిన వేడుకలలో ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, ఎంపీడీవో జానకి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బందిని సత్కరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం జరిపించారు. డీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- రెండోవార్డు రాయపాలెంలో సాగర వికాస ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో భీమిలి ఎంఈవో శివరాణి, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయిని శైలజ, గంగాకుమారి, వరలక్ష్మి, సత్యవతి తదితరులను సత్కరించారు.
- శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులను సన్మానించారు.

ఉత్సాహంగా పోటీలు

పీఎం పాలెం: ఆరో వార్డులోని 16వ పోలీస్ బెటాలియన్‌లో కమాడెంట్ కేవీ మురళీకృష్ణ కేక్ కట్ చేసి, ఉత్సవాలను ప్రారంభించారు. కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు కార్యక్రమాలను పర్యక్షించారు. మెడికవర్, నియో హాస్పిటల్ సౌజన్యంతో మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, షటిల్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. వేడుకలలో మినిస్టీరియల్ స్టాఫ్ కూడా పాలు పంచుకున్నారు. అధికారులతో పాటు 150 మంది పోలీస్ కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

- శిల్పారామంలో జాతర వాకర్స్, పాటల పందిరి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాటలు పాడి, నృత్యాలు చేశారు.
- బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో జోన్-2 జెడ్సీ కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

నిరాశ్రయులకు సహకారం

మధురవాడ: మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చంద్రంపాలెం ఆదిత్యనగర్‌లోని వైజాగ్ ఓల్డేజ్ హోమ్‌లో నిరాశ్రయులైన వృద్ధ మహిళల మధ్య కేక్ కట్ చేశారు. పలువురు మహిళలను, మధురవాడ ఏఈ శైలజను అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ రావు ఆధ్వర్యంలో సభ్యులు సత్కరించారు. ఆమె చేతులు మీదుగా నిరాశ్రయులకు ఆహారం, ఇతర దినుసులు అందజేశారు.

- ఆదిత్యనగర్‌లోని వెంకటేశ్వర విద్యాపీఠ్‌లో సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు ప్రారంభించారు. నాయకులు పి.రాజ్‌కుమార్, డి. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట మహిళలకు సత్కారం

తగరపువలస: రాష్ట్ర శిష్టకరణాల సంఘం మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయ వీధిలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ నృత్యకారణి రఘుపాత్రుని టీనా సంప్రదాయ నిత్యం ఆకట్టుకుంది. అనంతరం 21 మంది విశిష్ట మహిళలను ప్రశాంతి సత్కరించారు. వీరిలో ఆరికతోట విజయలక్ష్మి, మైలపల్లి భారతి, శిల్లా సరళారాణి, అరుణ, ముగడ రాజేశ్వరి, బెహరా రాజేశ్వరి తదితరులతో పాటు భీమిలి నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సత్కారం

పద్మనాభం: మండల బీజేపీ కార్యాలయంలో గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయం, పద్మనాభం మండల బీజేపీ శాఖ సంయుక్తంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.మలయవాసిని మహిళా ఉద్యోగులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సత్కరించారు. మండల శాఖ బీజేపీ అధ్యక్షురాలు తమటపు నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రూపాకుల రవికుమార్, ఈవోఆర్డీ మీనాకుమారి, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ కంటుబోతు లక్ష్మి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీరామ శోభాయాత్ర

- భక్తిశ్రద్ధలతో హోమం
- కమనీయంగా సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం



గుర్రపు బగ్గీపై ఉత్సవ మూర్తులతో చాగంటి



శోభాయాత్రలో కోలాటం



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు



సీతారాముల కల్యాణ మహోత్సవం

మధురవాడ: మధురవాడలో శ్రీరామ శోభాయాత్ర కనులపండువగా జరిగింది. సీతారాముల ఉత్సవమూర్తులు కొలువుదీరిన గుర్రపు బగ్గీకి ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సారథిగా వ్యవహరించి, కార్యక్రమాన్ని చివరి వరకు నడిపించారు. కొమ్మాది అష్టలక్ష్మీ ఆలయం వైశాఖేశ్వర స్వామి దేవాలయం, గాయత్రి విద్యాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచనాలు పూర్తయిన సందర్భంగా శనివారం ఉదయం శ్రీరామ హోమం జరిపించారు. హోమంలో ముత్యాలు, పగడాలు, జీడిపప్పు, బాదం పప్పు, వట్టివేరు, సుగంధ ద్రవ్యాలతో పాటు అనేక రకాలు వస్తువులు సమర్పించారు.

నేత్రపర్వంగా కల్యాణం

శనివారం సాయంత్రం సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తుల శోభాయాత్ర గుర్రపు బగ్గీని 4 తెల్ల అశ్వాలతో నడిపించగా, సారథిగా చాగంటి వ్యవహరించారు. కోలాటాలు, మేళతాళాలతో శోభాయాత్ర ముందుకు సాగింది. సుమారు 50 నదులు, 3 సముద్రములు, 15 తీర్థముల నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలములతో పట్టాభిషేకం చేశారు. కార్యక్రమాలకు సుమారు 4వేల మంది భక్తులు హాజరవడంతో పండగ వాతావరణం నెలకొంది. శ్రీరామ నామంతో ప్రాంతాలన్నీ మార్మోగాయి. కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు వెంకటేశ్వరరావు, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

తగరపువలస: పాత పరదేశిపాలెంలో దుర్గాలమ్మ ఆలయ 16వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు సంతోష్ శర్మ, ధర్మకర్త బోర సాంబమూర్తి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, చండీహోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించారు.

పిల్లా భరత్ కుమార్‌కు నివాళి

మధురవాడ:ఏడోవార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ కుమారుడు దివంగత భరత్‌కుమార్ 31 జయంతి సందర్భంగాఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నాయకులు పిల్లా వెంకటరావు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం, అన్న సంతర్పణ నిర్వహించారు.